అలంకారప్రాయంగా రైతువేదికలు

- నామమాత్రంగా సదస్సులు, సమావేశాలు
- మొక్కుబడిగా విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓలు
- సమావేశాలకు ఆసక్తి చూపని రైతులు
- నిర్వహణకు నిధులివ్వని ప్రభుత్వం

తాళ్లగడ్డ(సూర్యాపేట) : రైతులను సంఘటితం చేయడం కోసం, వివిధ పంటలపై అవగాహన కల్పించడానికి గత ప్రభుత్వం రైతు వేదికలను ఏర్పాటు చేసింది. పంటల సంరక్షణ, నూతన వంగడాలు, భూసారం పరీక్షలు, ఇతర వ్యవసాయ సంబంధిత విషయాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతూ అధిక దిగుబడులు రాబట్టేలా అవగాహన కల్పించడానికి గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన రైతువేదికలు ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయరంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు శాస్త్రవేత్తలతో రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు 5వేల ఎకరాల పరిధిని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి రైతు వేదికలు ఏర్పాటు చేశారు. రైతులకు పై విషయాలపై అవగాహన కల్పించేందుకు అలాగే ప్రభుత్వానికి రైతులకు వారధిగా ఉండేందుకు ఒక్కో క్లస్టర్‌కు ఒక ఏఈఓ (వ్యవసాయ విస్తరణ అధికారి)ని నియమించింది గత ప్రభుత్వం.

నిర్వహణ భారం.. సమస్యల నిలయం

రైతువేదికల నిర్వహణకు గత ప్రభుత్వం కొన్ని నెలల పాటు కొంత మొత్తం ఆర్థిక సహకారం అందించింది. రైతులతో సమావేశాలు, చర్చల సమయంలో రైతులకు అల్పాహారం ఏర్పాట్లకు, వేదిక కరెంటు బిల్లు, తదితర ఖర్చుల నిమిత్తం ఉపయోగపడేలా ప్రారంభసమయంలో కొన్ని నెలల పాటు ప్రభుత్వం కొంత మొత్తంలో నగదును సమకూర్చినప్పటికీ ప్రస్తుతం ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతువేదికలు నేడు కళతప్పాయి. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమానికి వచ్చే రైతులకు మరుగుదొడ్లు, తాగునీరు సౌకర్యం లేకపోవడంతో అటు వైపు ఎవరూ కన్నెత్తిచూడని పరిస్థితి నెలకొంది. మండలాన్ని 4 క్లస్టర్‌లుగా విభజించారు. బాలెంల, పిల్లలమర్రి, సూర్యాపేట, యండ్లపల్లిలో రైతువేదికలు నిర్మించారు.



నిరుపయోగంగా ఉన్న టేకుమట్ల రైతువేదిక

నెరవేరని లక్ష్యం..

రైతువేదికల్లో రైతు సమన్వయ సమితి సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయ పరిస్థితులపై అవగాహన కల్పించాలి. వానాకాలం, యాసంగిలో ఎలాంటి పంటలు వేసుకోవాలి, పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన ఎరువుల గురించి వివరిస్తూ ఏ పంట వేస్తే రైతులకు దిగుబడి, లాభం చేకూరుతుందో ఆ పంటల గురించి వ్యవసాయ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వివరించాలి. అదే విధంగా భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలకు అనుగుణంగా ఎలాంటి పంటలు వేయాలి, వాటికి ఏ ఎరువులు వాడాలి అనే విషయాలను రైతులకు తెలియజేయాల్సిఉంటుంది.

ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తాం



ఇప్పటి వరకు రైతులకు అవగాహన సదస్సులు, సమావేశాల ద్వారా పంటల గురించి, ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో భూసార పరీక్ష కేంద్రం అందుబాటులో లేదు. ప్రభుత్వం గతంలో మొబైల్ కిట్ ఇచ్చినా టెస్టింగ్ కెమికల్స్ అందుబాటులో లేకపోవడంతో భూసార పరీక్షలు నిర్వహించలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వెంటనే పరీక్షలు చేసి పంటలు, ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పిస్తాం.

– బి.కృష్ణ సందీప్ వ్యవసాయ అధికారి, సూర్యాపేట మండలం

ఉత్సవ వేదికలుగా మిగిలాయి



రైతులకు విత్తనాలు, ఎరువులు, పంటలపై, వ్యవసాయ పరిజ్ఞానం పెంచడానికి గత ప్రభుత్వంలో రైతు వేదికలు ఏర్పాటు చేశారు. రైతువేదికలు ఏ లక్ష్యంతో నిర్మించారో ఆ దిశగా ఉపయోగపడడం లేదు. ఉత్సవ వేదికలుగా మిగిలిపోయాయి. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని వేదికలను రైతులకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపట్టాలి.

– సంకరమద్ది రమణారెడ్డి, రైతు

భక్తిశ్రద్ధలతో మహాపూర్ణాహుతి, చక్రస్నానం



చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు నేడు చక్రస్నానం, మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెలవారుజాము నుంచి స్వామివారికి మేలుకొలుపు, ఆరాధన, బాలభోగం, మూలమంత్ర హోమాలు, ద్వారతోరణ, ధ్వజకుంభ ఆరాధనలు యజ్ఞాచార్యులు నల్లాన్ చక్రవర్తుల హరిచరణ్ ఆచార్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారికి నవకలశ తిరుమంజన స్నపనం నిర్వహించి చక్ర పెరుమాళ్లతో ఆలయంలోని ఈశాన్య భాగంలో ఉన్న కోనేరులో చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగింపు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమాల అనంతరం భక్తులు పండితులకు చందన తాంబూలాదులతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, సంకర్షణ ఆచార్యులు, శ్రీ హరి ఆచార్యులు, ఫణికుమార్ ఆ చార్యులు, ఆండాళ్ గోష్ఠి భక్తబృందం పాల్గొన్నారు.



చక్రస్నానం చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

కొలతలు లేకుండా కూలి చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ

పెన్‌పహాడ్ : ఉపాధిహామీ కూలీలకు వేసవి దృష్టిలో ఉంచుకొని కొలతలు లేకుండా రోజుకు రూ.600కూలి చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని లింగాలలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకొని ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పనుల వద్ద ఎండ తీవ్రతకు ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా అధికారులు ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కూలీలు రణపంగ కోటయ్య, సుకన్య, శ్రీకాంత్, సైదులు, సుజాత, వెంకన్న, సైదమ్మ, రజిని, శాంత, చిట్టి, గురవయ్య, శాంత, శారమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి : మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని బుధవారం బీఆర్ఎస్ నాయకులు మండల తహసీల్దార్ దయానందంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ నాయకుడు తడకమళ్ల రవికుమార్ మాట్లాడారు. కేసీఆర్ నియోజకవర్గానికి రూ.కోటితో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని అన్నారు. ఎమ్మెల్యే సామేల్ గెలిచిన నెల రోజులకే ఆయన పేరుతో శిలాఫలకం పెట్టుకొని ఆ భవనాన్ని ప్రారంభించి గాలికి వదిలేసారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, బొజ్జ సాయికిరణ్, బొంకూరి మధు, తడకమళ్లమల్లికార్జున్, బోయిని కొమరయ్య, పోతరాజు మహేష్, ఏపూరి మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి కలెక్టర్ పరామర్శ

నూతనకల్ : మండలంలోని మిర్యాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన మెంచు సత్తెమ్మ కుటుంబ సభ్యులను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ బుధవారం పరామర్శించారు. మృతురాలి దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు మెంచు నగేష్ మెదక్ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు.

పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలి



పోషక పదార్థాల కిట్లను అందజేస్తున్న డాక్టర్ లింగమూర్తి

తుంగతుర్తి : ప్రభుత్వం అందించే పోషక పదార్థాల కిట్లను క్షయ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని అన్నారం, తుంగతుర్తి, వెంపటి, సంగెం, గొట్టిపర్తి, వెలుగుపల్లి గ్రామాల్లో మొత్తం 22మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేసి వాటి ఉపయోగాలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ రవికుమార్, అన్నారం సెక్రటరీ దుండి రమేష్, హెల్త్ అసిస్టెంటు సోమన్న, యాదగిరిచారి, ఏఎన్ఎంలు రజిత, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పద్మ, రమ, మేరమ్మ ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

సూర్యాపేట అర్బన్ : ప్రపంచ అందాల పోటీల పేరుతో వివిధ మహిళా, యువజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మహిళా, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యను అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా వివిధ మహిళా, యువజన సంఘాల నాయకులు అక్రమంగా అరెస్టు చేయడం, పోలీస్‌స్టేషన్లలో గంటల తరబడి కూర్చోబెట్టడం తగదన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్బంధ పాలన కొనసాగుతుందన్నారు. సమావేశంలో దేశగాని హేమలత, నల్లగొండ నాగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రామలింగమ్మ, కూసు జయసుధ, పద్మ పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : కొనుగోలు కేంద్రాల నుంచి లారీల్లో వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎస్ఆర్ రైస్‌మిల్లు, తొండ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని, రికార్డులను, ఖోక్యానాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. హమాలీల సంఖ్యను పెంచి ఆలస్యం కాకుండా చూడాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఇసుక సకాలంలో అందుతుందా అని ఇందిరమ్మ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అనంతరం తొండ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టే కేంద్రాన్ని పరిశీలించారు. నాణ్యతతో యూనిఫామ్ కుట్టాలని కోరారు. అనంతరం తొండ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్, సివిల్ సప్లయ్ మేనేజర్ ప్రసాద్, ఎంపీడీఓ లాజర్, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎం మధుసూదన్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్ పాల్గొన్నారు.



తిరుమలగిరి : కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



నూతనకల్ : ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్

ఎగుమతులు సజావుగా నిర్వహించాలి

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం ఎగుమతులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తాము తెచ్చిన ధాన్యాన్ని తాలు, చెత్త లేకుండా తూర్పార పట్టాలని సూచించారు. కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐ కర్ణాకర్‌రెడ్డి, ఏపీఎం రమణాకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెన్‌పహాడ్ : కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ లాలు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మహ్మదాపురం, అనాజీపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యాన్ని శుభ్రపరిచి కాంటాలు వేయాలన్నారు. మిల్లర్ వద్ద ధాన్యం దిగుమతి కాగానే ట్రక్ షీట్ ప్రకారం ట్యాబ్‌లో నమోదు చేసి రైతులకు బిల్లులు అందే విధంగా చూడాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏపీఎం అజయ్‌నాయక్, నిర్వాహకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతిఒక్కరికి గుర్తింపు

- నియోజకవర్గ పరిశీలకుడు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

నాగారం : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని తుంగతుర్తి నియోజకవర్గ పరిశీలకుడు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పరిశీలకురాలు, ఏఐసీసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2017నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం దక్కుతుందన్నారు. అనంతరం మండల బ్లాక్, మండల పార్టీ, గ్రామశాఖ అధ్యక్షుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమ జిల్లా కోఆర్డినేటర్ శత్రురావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మహిళా అధ్యక్షురాలు అనురాధకిషన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, జనతారెడ్డి, యారాల ఇంద్రసేనారెడ్డి, నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, సోమయ్య, జయమ్మ, మల్లేష్, విజయ పాల్గొన్నారు.

మద్దిరాల : కాంగ్రెస్ కోసం కష్టపడిన ప్రతిఒక్కరికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మందుల సామేల్, టీపీసీసీ పరిశీలకుడు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌లో 2017 కన్నా ముందు ఉన్నవారు, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసిన వారు బ్లాక్, మండల, గ్రామశాఖ అధ్యక్షులుగా పదవుల కోసం దరఖాస్తు చేసుకోవాలని అలాంటి వారికే మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పలువురు కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, అబ్జర్వర్ శత్రురావు, హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్త కృష్ణమూర్తి, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, కుతిబుద్దిన్, బొబ్బిలి వెంకన్న, పచ్చిపాల సుమతి వెంకన్న, స్వప్న, బర్పటి ఉపేందర్, హమీద్, లింగయ్య, సుల్తాన్ నరేష్, కూజ ఎల్లేష్, ఉపేందర్, వల్లపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నాగారం : మాట్లాడుతున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, పక్కన చెవిటి వెంకన్న



మద్దిరాల : దరఖాస్తులు స్వీకరిస్తున్న మురళీనాయక్, శత్రురావు, చెవిటి వెంకన్న

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కష్టపడిన కార్యకర్తలకే పదవులు లభిస్తాయని టీపీసీసీ పరిశీలకుడు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని అభివృద్ధిపర్చాలనే లక్ష్యంతో ఏఐసీసీ చేస్తున్న ఆలోచనకు అనుగుణంగా గ్రామశాఖ, మండల, బ్లాక్, బూత్‌స్థాయి అధ్యక్షుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, పార్టీ పరిశీలకులు చత్రురావు, హస్తకళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, మధు, అనురాధ, అశోక్ యాదవ్, నాగరాజు, వివేక్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

మహిళా అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : సమాజంలో మహిళలను అభివృద్ధిపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని 54మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి మహిళను ఆర్థికంగా అభివృద్ధిపర్చడమే ఎజెండాగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ఆడపిల్లలను కలిగిన తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండాలనే లక్ష్యంతో కల్యాణలక్ష్మి పథకాన్ని అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సమభావన సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు ప్రతి నెలా సన్నబియ్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుంపటిగా మార్చారని ఆరోపించారు. ఎన్నికల సందర్భంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీఎం రేవంత్‌రెడ్డి వాటి అమలు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, తిరుమలప్రగఢ అనురాధ, పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునిత, పాల్వాయి నాగరాజు, పసుల అశోక్‌యాదవ్, భూరెడ్డి సంజీవరెడ్డి, ఎలిమినేటి కృష్ణప్రశాంత్, నకిరేకంటి వెంకన్న, బంటు బద్రి, బండపల్లి సాగర్, పచ్చిపాల సుమతి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

నూతనకల్ : ప్రజలు చట్టాల అమలు, శిక్షలపై అవగాహన కలిగి ఉండాలని, అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు ఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో నిర్వహించిన పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు చట్టాల అవశ్యకతను తెలుసుకోవాలన్నారు. క్షణికావేశం, స్వార్థంతో ఇతరులకు ఇబ్బంది కల్గించొద్దని, సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పోలీసు కళాజాత ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మహిళలపై దాడులు, మత్తుపదార్థాల వినియోగంపై ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తుంగతుర్తి సీఐ నర్సింహారావు, ట్రైనీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

సూర్యాపేటటౌన్ : ప్రజలు చట్టాల అమలు, శిక్షలపై అవగాహన కలిగి ఉండాలని ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీశ్రీనగర్‌లో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గ్రామాల్లో, పట్టణాల్లో నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలనీప్రజలు పాల్గొన్నారు.



సూర్యాపేటటౌన్ : మాట్లాడుతున్న ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

నాగారం : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో నిర్వహించిన పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల, యువత గంజాయి, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత గంజాయి, బెట్టింగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో శాంతిని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.ఐలయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం అందజేత

నూతనకల్ : మండలంలోని యడవెల్లి గ్రామానికి చెందిన పిట్టల సూర్యకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిర్మల్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు క్వింటా బియ్యం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కొచ్చెర్ల బాబు, తూముల వెంకటేశ్వరరావు, సంధ్య జ్యోతి, భిక్షం, సుదర్శన్, నెల్లుట్ల మల్లయ్య, కట్ట కృష్ణ తదితరులు ఉన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

నూతనకల్ : మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని సంక్షేమ సంఘం మండల నాయకుడు గడ్డం యాదగిరి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నేటి నుంచి రెండో విడత పాదయాత్రను తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెంలో మారోజు వీరన్న స్థూపం వద్ద నుంచి చేపట్టనున్నట్లు, ఈ పాదయాత్రకు తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో మలిదశ ఉద్యమకారులు మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, లింగయ్య, బాలమల్లు, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

అర్వపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెంలో మారోజు వీరన్న స్థూపం నుంచి ఉద్యమకారులు పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను బుధవారం అర్వపల్లిలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకుడు దిర్శనపు కృష్ణమూర్తి విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్, రమణ, లక్ష్మీనారాయణ, సురేష్, బి.శ్రీను, జగన్, విజయ్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో ఈ నెల 16న వీరతెలంగాణ పోరాటయోధుడు, ఆత్మకూరు గ్రామ మాజీ సర్పంచ్ డేగల మధుసూదన్ 35వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జనార్దన్, భిక్షం, వెంకటకృష్ణ, దశరథ, శ్రీనివాస్, పరమేష్, లింగారెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తుంగతుర్తి : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎఫ్‌టీయూ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కన్వీనర్ కోటా రామస్వామి, బీఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు రఫీ, సీఐటీయూ నాయకులు పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడుదారులకు ఊడిగం చేసే విధానాలు అనుసరిస్తున్నారని అందులో భాగంగానే 29కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించి వేస్తున్నారని అన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు నాగేల్లి రామనర్సయ్య, తడకమళ్ల సంజీవ్, వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తే ఊరుకోం

సూర్యాపేట అర్బన్ : కార్మిక చట్టాలను కాలరాస్తే ఊరుకోమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ కార్మికులతో కలిసి కరపత్రాల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. మే 20న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓగోటి దశరథ, శివ, వెంకన్న, ఎల్లమ్మ, మురళి తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్ : ప్రచారంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు

జలగం జనార్దన్ సేవలు మరువలేనివి

సూర్యాపేట అర్బన్ : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు జలగం జనార్దన్ సేవలు మరువలేనివని ఆపార్టీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనార్దన్ నాలుగో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జనార్దన్ తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని కార్యకర్తలకు ధైర్యాన్నిచ్చారని అన్నారు. ఈ నెల 21నుంచి 25వరకు నిర్వహించే వర్ధంతి సభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అనుభవిల్లి వెంకట్‌రెడ్డి, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి సైదులు, అరుణోదయ జిల్లా నాయకుడు తడకమళ్ల నాగమల్లు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, జిల్లా నాయకులు రామలింగమ్మ, జయసుధ, ప్రవీణ్, కార్తీక్, వీరన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయికులు